జగనన్న సురక్షపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టరు జగనన్న సురక్ష, రీసర్వే, సిసిఆర్‌సి కార్డుల జారీ అంశాలపై మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంపుల్లో ఎన్ని టోకెన్లు ఇచ్చారు, వాటి ప్రకారం ప్రజలకు వివిధ ధ్రువపత్రాలు అందజేశారా, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారా మండలాలు, మున్సిపాల్టీల వారిగా జెసి సమీక్షించారు. జిల్లాలో పలు మండలాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సర్వీస్ రిక్వెస్ట్‌లు తక్కువగా ఉన్నాయని ప్రశ్నించారు. సచివాలయ వాలంటీర్లు కచ్చితంగా ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వివరించి వారి సర్వీస్ రిక్వెస్ట్‌ను అడిగి తెలుసుకుని ధ్రువపత్రాలను జారీ చేయాలన్నారు. రీ సర్వే 21 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టరు ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ దాసి రాజు, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, అధికారులు పాల్గొన్నారు.

గాడిన పడని ప్లస్ టూ..!

- హైస్కూళ్లలో ప్లస్ టూ మహిళా కళాశాలల దుస్థితి
- సౌకర్యాలు లేమినే విద్యార్థుల విముఖతకు కారణం
- గతేడాది ఉమ్మడి జిల్లాలో 13.65 శాతమే ఉత్తీర్ణత
- 36 ప్లస్ టూ స్కూళ్లలో ఈ ఏడాది చేరింది 373 మందే
- బోధనా సిబ్బందిని నియమించినా అవగాహన కల్పనలో విఫలం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రతి మండలంలోనూ ఒక హైస్కూల్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్లస్ టూ (మహిళా కళాశాల) విద్య రెండో ఏడాదీ గాడిన పడని దుస్థితి నెలకొంది. తొలిఏడాది బోధనా సిబ్బంది, పాఠ్యపుస్తకాలు, ల్యాబ్‌లు వంటి వసతులేవీ ఏర్పాటు చేయకుండా తరగతులు ప్రారంభించడం విద్యార్థులకు శాపంగా పరిణమించింది. దీంతో రెండో ఏడాది 2023-24 ఏడాదికి సంబంధించిన విద్యా సంవత్సరంలోనూ పెద్దగా విద్యార్థులు చేరని పరిస్థితి ఏర్పడింది. ప్లస్ టూ విద్యపై ప్రభుత్వం వ్యవహరించిన తీరు ప్రస్తుత పరిస్థితికి కారణమని చెప్పొచ్చు. పదో తరగతి పూర్తయిన బాలికలు మధ్యలోనే చదువు ఆపేయకుండా ప్రభుత్వం మండలానికి ఒక హైస్కూల్‌లో ప్లస్ టూ కింద ఇంటర్ విద్యను ప్రవేశ పెట్టింది. 2022-23 సంవత్సరంలో దీనికి అంకురార్పరణ చేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 36 ప్లస్ టూ మహిళా కాలేజీలకు అనుమతిచ్చి హడావుడిగా ప్రారంభించింది. ప్రథమ సంవత్సరం ఇంటర్ విద్యలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 359 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. ప్లస్ టూను సమర్ధవంతంగా నిర్వహించి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించింది. పాఠాలు చెప్పేందుకు అధ్యాపకులను నియమించకుండా హైస్కూల్ ఉపాధ్యాయులనే పాఠాలు బోధించాలని చెప్పి చేతులు దులుపుకుంది. హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో పూర్తిగా ప్లస్ టూ చదువు అటకెక్కింది. ల్యాబ్‌లుగాని, పాఠ్యపుస్తకాలుగాని ఏఒక్కటీ విద్యార్థినులకు అందుబాటులో లేకుండాపోయాయి. దీంతో ఏప్రిల్ 26న వచ్చిన ఇంటర్ ఫలితాల్లో ప్లస్ టూ విద్యార్థినులు ఫలితాల సాధనలో చతికిలబడ్డారు. ఉమ్మడి జిల్లాలో 36 కాలేజీల నుంచి 359 మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయగా కేవలం 49 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. అంటే 13.65 శాతం మాత్రమే ఉత్తీర్ణత నమోదైంది. పలు ప్లస్ టూ స్కూళ్ల నుంచి పరీక్షకు హాజరైన విద్యార్థినుల్లో ఒక్కరు కూడా ఉత్తీర్ణత సాధించని దుస్థితి నెలకొంది. చాలా ప్లస్ టూ స్కూళ్ల నుంచి ఒక్కరు కూడా పాస్ కాలేదు. పాఠాలు బోధించే అధ్యాపకులు లేకపోవడం, పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడం వంటి పలు కారణాలతో ఈ దుస్థితి దాపురించింది. దీంతో తల్లిదండ్రులు, విద్యార్థినులు ప్లస్ టూ స్కూళ్లపై నమ్మకం కోల్పోయారు.

ఈ ఏడాదీ విద్యార్థినుల సంఖ్య నామమాత్రమే

2023-24కు సంబంధించి ప్లస్ టూ స్కూళ్లలో చేరిన విద్యార్థినుల సంఖ్య నామమాత్రంగానే ఉంది. ఇప్పటి వరకూ ప్లస్ టూలో మొదటి సంవత్సరం 373 మంది చేరగా, రెండో ఏడాదికి సంబంధించి 320 మంది విద్యార్థినులు చేరారు. ప్రభుత్వం ప్లస్ టూలో మూడు గ్రూపులను ప్రవేశ పెట్టింది. ఎంపిసి, బైపిసి, సిఇసి గ్రూపులు ఉన్నాయి. ప్రతి గ్రూపునకూ కనీసంగా 20 మందికి తక్కువ కాకుండా ఉండాల్సి ఉంది. ఆ విధంగా చూస్తే మొదటి ఏడాదికి సంబంధించి 2,160 మంది, రెండో ఏడాది విద్యార్థినుల సంఖ్య 2,160 మొత్తం 4,320 మంది ఉండాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఇంటర్ రెండు సంవత్సరాల విద్యార్థినులను కలిపినా 701 మంది మాత్రమే ఉన్నారు. ప్లస్ టూలో విద్యాబోధనపై తల్లిదండ్రులు నమ్మకం కోల్పోవడమే దీనికి కారణం.

లెక్చరర్లు ఫుల్.. విద్యార్థినులు పరిమితం

గతేడాది ప్లస్ టూలో పాఠాలు బోధించే లెక్చరర్లు లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయారు. దీంతో ఈ ఏడాది లెక్చరర్ల నియామకంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పీజీ చదివిన ఉపాధ్యాయులను ప్లస్ టూ లెక్చరర్లుగా ప్రభుత్వం ప్రమోట్ చేసింది. మొత్తం 252 మంది లెక్చరర్లు అవసరం ఉండగా ఇప్పటికే 234 మందిని నియమించింది. అయితే విద్యార్థినుల సంఖ్య మాత్రం లేకుండాపోయింది. పలుచోట్ల ప్లస్ టూ స్కూళ్లలో లెక్చరర్లు ఉన్నా విద్యార్థులు ఒక్కరు కూడా లేరని చెబుతున్నారు. ప్రభుత్వం లెక్చరర్ల నియామకం, అందుబాటులోనే ఇంటర్ విద్య తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించకపోవడమే దీనికి కారణంగా చెప్పొచ్చు. దీంతో ప్లస్ టూ విద్యాలయాలు గాడిన పడేదెప్పుడో తెలియని దుస్థితి నెలకొంది.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కౌలురైతు సంఘం నేతలు

చినమల్లంలో రొయ్యల చెరువుల అక్రమ తవ్వకం ఆపాలి

కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

పెనుగొండ మండలంలోని చినమల్లం, మిద్దేవారిపాలెం, తాళ్లపాలెం గ్రామాల్లో చేపట్టిన ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. 850 ఎకరాల్లో చెరువుల తవ్వకం వల్ల పంట భూమి, తాగు, సాగునీరు కలుషితమవుతుందన్నారు. దీనివల్ల రైతులు నష్టపోవడంతోపాటు ప్రజానీకం రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద రొయ్యల చెరువుల అక్రమ తవ్వకాలు ఆపాలని ఎపి కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఈ మూడు గ్రామాల్లో పేద రైతులు, కౌలురైతులు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారన్నారు. గ్రామాలను ఆనుకొని ఉన్న పంట పొలాలను కొంతమంది వ్యక్తులు చెరువులుగా మార్చి ఎలాంటి మురుగు సౌకర్యమూ లేకపోయినా ప్రధాన పంట కాలువ బ్యాంక్ కెనాల్‌లోకి తూములు పెట్టి నిత్యం కలుషిత నీటిని వదిలేస్తున్నారన్నారు. ఆ నీరు తిరిగి బోదెల్లోకి, పొలాల్లోకి వచ్చి పంట భూములు దెబ్బతింటున్నాయని, ఈ నీటిని తాగిన గేదెలు మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో అధికారులు పక్కనే మరో పదెకరాల రొయ్యల చెరువులకు అనుమతివ్వడం దారుణమని, ఆ భూములు ఎలాంటి ఆక్వా జోన్లో లేవని అన్నారు. అసలు 850 ఎకరాల్లో 24 ఎకరాలకు ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చిన మత్స్య శాఖ అధికారులు పొంతనలేని సమాధానం చెబుతూ ఆక్వా సాగు పెద్దలకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. 'మీరు ఆక్వా జోన్ కావాలని సంతకాలు పెట్టారంట, పంచాయతీ తీర్మానం చేసిందంట, తర్వాత కమిటీ వేసి మాట్లాడతాం' అంటూ లేనిపోని మాటలు చెప్పి కాలయాపన చేసేందుకు అధికారులు కుట్ర పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి మురుగు పారుదల సౌకర్యమూ లేకపోతే వెంటనే సంబంధిత ఆక్వా చెరువులను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు, నేతలు ఎస్.వెంకటేశ్వరరావు, జి.త్రిమూర్తులు, కె.హనుమంతరావు, కె.సత్యనారాయణ, జి.నాగేశ్వరరావు, సిహెచ్.ధర్మేంద్ర, వి.సత్యనారాయణ, జి.అర్జునుడు, కె.సాయికుమారి, బి.కుమారి పాల్గొన్నారు.

ఫలించిన 'పోరుకేక'

- మారిన పోలవరం కాంటూరు లెక్కలు
- 41.15 కాంటూరులోకి 19 గ్రామాలు చేరిక
- 3,480 కుటుంబాలకు ఊరట
- పరిహారంగా నిర్వాసితులకు అందనున్న రూ.238.69 కోట్లు
- సిపిఎం మహా పాదయాత్రతో దిగొచ్చిన ప్రభుత్వం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సిపిఎం చేపట్టిన 'పోలవరం పోరుకేక' మహా పాదయాత్రతో ప్రభుత్వం దిగొచ్చింది. పోలవరం కాంటూరు లెక్కల్లో పలు గ్రామాలకు సంబంధించిన మార్పులపై స్పష్టమైన ప్రకటన చేసింది. ఇప్పటి వరకూ 45.72 కాంటూరులో ఉన్న కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 19 గ్రామాలను 41.15 కాంటూరులో చేర్చింది. చేర్చిన వాటిలో వేలేరుపాడు మండలంలో తొమ్మిది గ్రామాలు, కుక్కునూరు మండలంలో పది గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో మొత్తం గిరిజన కుటుంబాలు 1,443, గిరిజనేతర కుటుంబాలు 2,037 ఉన్నాయి. కాంటూరు మార్పుతో రెండు మండలాల్లో మొత్తం 3,480 కుటుంబాలకు ఊరట లభించనుంది. పరిహారం కింద రూ.238.69 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం మూడు కాంటూరులుగా విభజించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంత గ్రామాలను మొదటి కాంటూరులో చేర్చగా రెండో విడత ఖాళీ చేసే గ్రామాలను 41.15 కాంటూరులో, మిగిలిన గ్రామాలను 45.72 కాంటూరులో చేర్చింది. 2022 వరదలకు ప్రభుత్వం ప్రకటించిన కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా గ్రామాలన్నీ ముంపునకు గురయ్యాయి. దీంతో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో లైడార్ సర్వేతో కాంటూరు లెక్కలు మరోసారి తేలుస్తామని ప్రభుత్వం ప్రకటించింది. లైడార్ సర్వే అనంతరం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 18 గ్రామాలను 41.15 కాంటూరులో చేరుస్తున్నట్లు ప్రకటించి కొద్దిరోజుల తర్వాత మళ్లీ మాటమార్చింది. దీంతో నిర్వాసితుల నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ జూన్ 20న అల్లూరి జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక నుంచి ప్రారంభమైన సిపిఎం మహాపాదయాత్ర ఈ నెల నాలుగో తేదీన విజయవాడ చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ యాత్రకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వం వహించారు. రాజకీయ పార్టీల నుంచి, ప్రజాసంఘాల నుంచి పెద్దఎత్తున మద్దతు లభించింది. రాష్ట్ర, జాతీయ నాయకులు ఈ పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. దీంతో ప్రభుత్వం ఒక అడుగు వెనక్కేసింది. 45.72 కాంటూరులో ఉన్న 19 గ్రామాలను 41.15 కాంటూరులో చేరుస్తున్నట్లు బుధవారం స్పష్టమైన ప్రకటన చేసింది. ఇంకా నిర్వాసితులకు సంబంధించిన అనేక అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంది.

41.15 కాంటూరులో చేర్చిన గ్రామాలు

వేలేరుపాడు మండలంలోని గ్రామాలు..

1.కాకిసనూరు, 2.పెదమానుకొల్లు, 3.తూర్పుమెట్ట, 4.టేకూరు, 5.కాచారం, 6.ఎర్రమెట్ట, 7.యడవల్లి, 8.పేరంటాలపల్లి, 9.టేకుపల్లి

కుక్కునూరు మండలంలోని గ్రామాలు;

1.కౌండిన్యముక్తి, 2.మాధవరం, 3.యల్లప్పగూడెం, 4.బెస్తగూడెం, 5.ఆంబోతులగూడెం, 6.చెరువుకొమ్ముగూడెం, 7.ఎర్రబోరు, 8.గుండమ్మబోరు, 9.ముత్యాలంపాడు, 10.రావిగూడెం

వరద ముంపు ఆధారంగా గ్రామాలను గుర్తించాలి

ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి, ఏలూరు

ఇప్పటికైనా ప్రభుత్వం పలు ముంపు గ్రామాలకు సంబంధించి కాంటూరు మార్పు చేయడం మంచి పరిణామం. ముంపు గ్రామాల ఎంపిక అశాస్త్రీయంగా కాకుండా శాస్త్రీయంగా చేపట్టాలి. 1986, 2022 వరదల ప్రాతిపదికన ముంపు గ్రామాల గుర్తింపు జరగాలి. గుర్తించని గ్రామాలను వెంటనే చేర్చాలి. నిర్వాసితులకు పరిహారం వెంటనే అందించాలి.

ప్రయివేటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఒక సమగ్ర చట్టం తీసుకురావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్మిక శాఖ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి నేటికీ పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యూటీ, బోనస్ వంటివి అమలు కావడం లేదన్నారు. వీరి కష్టం వల్ల పేరు ప్రతిష్టలు, ఆదాయం పెరుగుతున్నప్పటికీ వీరికి కనీస వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు నిల్చొని ఉండటం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. 1994లో వచ్చిన జిఒ నెం.1 ప్రకారం వేతనాలు, సౌకర్యాలు ఇవ్వని సంస్థల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న వారికి సిఐటియు అన్నివిధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే వీరి సమస్యలపై చర్యలు చేపట్టాలని, లేకుంటే సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.అజయకుమారి, పి.దక్షిణామూర్తి, గార రంగారావు, పిఎఫ్ నర్సింహారావు, టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతాం : ఎంఎల్‌ఎ

పెనుగొండ : సిద్ధాంతం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేస్తామని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం సిద్ధాంతం హైస్కూల్లో జరిగిన అమ్మఒడి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఎంఎల్‌ఎగా, మంత్రిగా పనిచేసిన వ్యక్తులు ఏమీ చేయలేకపోయారన్నారు. ప్రస్తుతం హైస్కూల్‌కు గ్రౌండ్ మెరక చేసే ఏర్పాట్లలో ఉన్నామని, గ్రౌండ్ పూర్తయిన వెంటనే వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులతో పాటు సకల ఏర్పాట్లు చేసి మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతారని అవసరం మేరకు కంప్యూటర్స్ కూడా అందజేస్తానని తెలిపారు. విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకుంటే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని, తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పి.వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి పోడూరి గోవర్ధన పాల్గొన్నారు.

9న పాలకొల్లుకు అశోక్ గజపతిరాజు రాక

పాలకొల్లు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకల ముగింపు ఉత్సవం పాలకొల్లు నియోజకవర్గంలో ఈ నెల 9వ తేదీ ఆదివారం సాయంత్రం అద్దేపల్లివారి సత్రం వద్ద నిర్వహిస్తున్నట్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. గతేడాది జులై 4న ప్రారంభమైన జయంతి ఉత్సవాలు ప్రతినెల ఒక్కో గ్రామంలో భారీస్థాయిలో నిర్వహించారు. ఈ ఉత్సవం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు పాల్గొంటారని తెలిపారు.

చెరువులో చెత్తా చెదారం తీయిస్తున్న సర్పంచి

చెరువులో చెత్తాచెదారం తొలగింపు

ప్రజాశక్తి - ఉండి

ఆక్రమణల చెరలో ఉన్న బాపిరాజు చెరువును గ్రామ పంచాయతీ స్వాధీనం చేసుకుని చెత్తా చెదారాన్ని తొలగించాలని గేదెల నరసింహులు చేసిన జల దీక్షకు అధికారులు, గ్రామ సర్పంచి స్పందించారు. గ్రామ సర్పంచి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ వీరాస్వామి నాయుడు ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు చెరువులో చెత్తాచెదారం తొలగింపు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ వీరాస్వామి నాయుడు మాట్లాడుతూ పెదపుల్లేరు గ్రామ పంచాయతీకి చెందిన బాపిరాజు చెరువులో చెత్తా చెదారాన్ని తొలగించి పంట కాలువ నీటిని నింపి ప్రజా అవసరాలకు ఉపయోగించనున్నట్లు తెలిపారు. గతంలో బాపిరాజు చెరువు గ్రామస్తులకు తాగునీటి అవసరాలు తీర్చేదని, కాలక్రమేణా ఆ చెరువు చెత్తాచెదారంతో నిండిపోయి నిరుపయోగంగా మారిందన్నారు. ప్రస్తుతం చెత్తను తొలగించి చెరువును నీటితో నింపి ప్రజావసరాలకు వినియోగిస్తామని సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ వీరాస్వామి నాయుడు స్పష్టం చేశారు.

లస్కర్ పోస్టులు భర్తీ చేయాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న ఆకుల హరేరామ్

గ్రామాల్లో రైతులకు అనుసంధానంగా ఉన్న లస్కర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ మాట్లాడుతూ సాగునీటి, మురుగు కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో సాగునీరందక నేటికీ నారుమడులు వేసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. జిల్లాలో 350 లస్కర్ పోస్టులకు గాను 47 పోస్టులు మాత్రమే ఉద్యోగులు పని చేస్తున్నారని, మిగతా 197 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులేనని తెలిపారు. వారికి రూ.10,500 మాత్రమే జీతం ఇవ్వడంతో ఎలా జీవనం గడుపుతారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 300 పోస్టుల భర్తీతో పాటు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాన్ని నిర్వీర్యం చేయడం కోసం తీసుకొచ్చిన జిఒ 254ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కేంద్రాలను బలోపేతం చేసి ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలని. గత పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే ఇవ్వాలని కోరారు. రైతాంగ సమస్యలపై జిల్లాలోని అన్ని రైతు సంఘాలూ సమన్వయంతో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, చిర్లా పుల్లారెడ్డి, సహాయ కార్యదర్శి కిలారి తవిటినాయుడు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జిన్నూరు హైస్కూల్లో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

పోడూరు: జిన్నూరు జెడ్‌పి హైస్కూల్‌ను సబ్‌కలెక్టర్ సూర్యతేజ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో గత మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతంపై ఆరా తీశారు. అయితే ఎక్కువ మంది ఈ హైస్కూల్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించక పోవడంతో, ఫెయిల్ అయిన కొంతమంది విద్యార్థులను సబ్‌కలెక్టర్ నేరుగా కలిసి మళ్లీ తరగతులకు హాజరై ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఎవరైతే మరలా పాఠశాలకు హాజరవుతారో వారందరికీ ప్రభుత్వం తరపు నుంచి వచ్చే అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్‌వి కృష్ణారావు, ఎండిఒ సుహాసిని, ఆర్‌ఐ రాంబాబు, హెచ్‌ఎం.శివజ్యోతి పాల్గొన్నారు.

ఎట్టకేలకు అరుంధతీపేటకు సీసీ రోడ్డు

ప్రజాశక్తి - వీరవాసరం

అరుంధతీపేటలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

75 సంవత్సరాల స్వాతంత్ర్య చరిత్రలో వీరవాసరం అరుంధతీపేటకు మొట్టమొదటిసారి అభివృద్ధి ఫలం దక్కింది. సర్పంచి చికిలే మంగతాయారు సీసీ రోడ్డు వేయడం పట్ల స్థానిక దళితులు హర్షం వ్యక్తం చేశారు. సుమారు రూ.మూడు లక్షలతో అరుంధతీపేటలో అంతర్గత సీసీ రోడ్డు, కల్వర్టు ఏర్పాటు చేస్తున్నారు. పాలకులు మారుతున్నా ఇప్పటి వరకూ ఈ ప్రాంతంలో కనీసం కంకర రోడ్డు వేయకపోవడం పట్ల గత పాలకుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది. గ్రామానికి మొదటి వార్డుగా, మొదటి రోడ్డుగా ఉన్న ఈ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. పూర్వం నుంచి గ్రామ అవసరార్థం తమ వృత్తిని చేసుకుంటూ వీరవాసరం పరిసర ప్రాంతాలకు క్రియశీలకంగా ఉన్న ఈ దళితులు మొర ఏ నాయకుడూ ఆలకించిన దాఖలాల్లేవు. ఎట్టకేలకు ఈ ప్రాంతంలో ఇన్నాళ్లకు సీసీ రోడ్డు వేయడం పట్ల దళితులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ పేటకు ప్రధాన మార్గంగా ఉన్న పుంత రోడ్డును కూడా అభివృద్ధి చేయాలని వారు వేడుకుంటున్నారు.

21 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి రవిప్రకాష్

చెడు వ్యసనాలకు బానిసై అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి అమ్ముతున్న నలుగురు యువకులను అరెస్టు చేసి 21 కిలోల గంజాయిని, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ తెలిపారు. బుధవారం స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా పశ్చిమను మార్చేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో డ్రగ్స్ సరఫరా చేసేవారిపై, డ్రగ్స్ వినియోగించే వారిపై, అమ్మే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. దీంతో టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డు, స్థానిక సిద్ధార్థ ఐటిఐ కళాశాల రోడ్డు, అనాకోడేరు కాలువ గట్టు, ఆకివీడుకు చెందిన హనుమంతరాజు ఖాళీ స్థలంలో నలుగురు యువకులు గంజాయి సేవిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ రాంబాబు, సిబ్బంది వారిపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్ట మండలం పోర్చాలబ్బు గ్రామానికి చెందిన అరబీర్ విజయకుమార్, పాలకొల్లు పట్టణం శంభునిపేటకు చెందిన మేళం పవన్‌కుమార్, భీమవరం పట్టణం దుర్గాపురానికి చెందిన గూడూరి దుర్గప్రసాద్, పొట్నూరి గణేష్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుండి 21 కిలోల గంజాయి, రూ.21 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వాటి విలువ సుమారు నాలుగు లక్షలు ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 52 గంజాయి కేసులు నమోదయ్యాయని, 236 మందిని అరెస్టు చేశామని చెప్పారు. ఐదుగురుపై పీడీ యాక్ట్ కేసు పెట్టామన్నారు. అయితే గంజాయికి అలవాటు పడిన యువకులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో దఫదఫాలుగా కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డిఎస్‌పి శ్రీనాథ్, సిఐ బి.కృష్ణకుమార్, ఎస్ఐలు రాంబాబు, అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీలకు చదువుకునే హక్కు కల్పించింది అంబేద్కర్

ప్రజాశక్తి - కాళ్ల



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు

భారతదేశంలో స్త్రీలకు చదువుకునే హక్కు కల్పించిన వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. కోలనపల్లి గ్రామంలో విజయవాడ ఎస్‌పి మోకా సత్తిబాబు ఆర్థిక సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని శాసనమండలి ఛైర్మన్ మోసేన్‌రాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మోషేన్‌రాజు మాట్లాడుతూ గతంలో పరిశ్రమల్లో కార్మికులకు 12 గంటల పని విధానం ఉండేవి, ఎనిమిది గంటల చట్టం అమల్లోకి తీసుకొచ్చిన మహావ్యక్తి అంబేద్కర్ అన్నారు. పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ ఆనాడు అణగారిన వర్గాల కష్టాలను చూసి అందరికీ సమాన హక్కులు కల్పించాలని రాజ్యాంగాన్ని రచించిన వ్యక్త అంబ్కేదర్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొనకంచి సూర్య నారాయణమూర్తి, జెడ్‌పిటిసి సోమేశ్వరరావు, ఎంపిటిసి వేగేశ్న సత్యనారాయణరాజు, కోనా జోసెఫ్, సోడదాసి గంగయ్య, రెవరెండ్ జార్జి ముల్లర్ పాల్గొన్నారు.

నాగేశ్వరరావు సేవలు చిరస్మరణీయం

సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్

ప్రజాశక్తి - పాలకోడేరు

భీమవరం తాలూకా రైస్‌మిల్లు ఉద్యమ విస్తరణలో యాతం నాగేశ్వరరావు సేవలు చిరస్మరణీయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ కొనియాడారు. శృంగవృక్షం జయలక్ష్మి రైస్‌మిల్లు బుధవారం నాగేశ్వరరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ 1962లో భీమవరం తాలూకా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేయడంలో నాగేశ్వరరావు కీలకపాత్ర పోషించారన్నారు. యాజమాన్యాలు సంఘం పెట్టుకోవడానికే అనేక ఆటంకాలు కలిగించినా కార్మికులందరినీ ఐక్యంగా నిలబెట్టి పోరాటాలు నిర్వహించారన్నారు. కనీస వేతనాలు, నూతన వేతన ఒప్పందాల కోసం అనేక సందర్భాల్లో జరిగిన పోరాటాల్లో పోలీస్ కాల్పుల్లో కూడా నాగేశ్వరరావు ధైర్యంగా నిలబడ్డారన్నారు. 74 రోజుల సమ్మెలో యాజమాన్యాలు యూనియన్ విచ్ఛిన్నం చేయడం కోసం చేసిన ప్రయత్నాలను తిప్పికొట్టడంలో నాగేశ్వరరావు మంచి కృషి చేశారని తెలిపారు. సాధించుకున్న హక్కులు, చట్టాలు నాగేశ్వరరావు స్ఫూర్తితో పోరాడి నిలబెట్టుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సభలో భీమవరం తాలూకా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కలిదిండి సత్యనారాయణ, బి.వాసుదేవరావు, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొత్త సత్తిబాబు, బద్రి రాము, అప్పారావు, కడలి రమణరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

సంతాప సభలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ వార్షికోత్సవం

భీమవరం రూరల్ :రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఎంతోమంది నిరుపేదలకు లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ 45వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఎండి ఆదేశాల మేరకు బుధవారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో గృహ నిర్మాణ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌డిఒ దాసి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ సంస్థ ద్వారా 1979 నుంచి గూడు లేని నిరుపేదలకు అనేక లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. నేడు చేపట్టిన ఇళ్ల నిర్మాణం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. రిటైర్డ్ ఉద్యోగులను శాలువాతో సత్కరించి మెమెంటోలు అందించారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులు 12 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులు పిడి పిచ్చియ్య, ఇఇ, డిఇఇ, ఎఇ, వర్క్ఇన్‌స్పెక్టర్, డిఇఒలు పాల్గొన్నారు.


ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాటూరి శ్రీనివాస దొరబాబు

'ఫ్యామిలీ డాక్టర్'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఉండి

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రజలకు సంజీవని వంటిదని వైసిపి సోషల్ మీడియా జిల్లా కో-ఇన్‌ఛార్జి పాటూరి శ్రీనివాస దొరబాబు అన్నారు. మండలంలోని పెదపుల్లేరు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని దొరబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రజలకు సంజీవని వంటిదన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులకు సంబంధించిన ఇసిజి, వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించడమే కాకుండా షుగర్, బిపి వ్యాధిగ్రస్తులకు, గర్భిణులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సాయిచంద్ర, హెల్త్ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజును కలిసిన సత్యసుధామ

ప్రజాశక్తి - ఆచంట

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులుగా సత్య సుధామ నియమించడం పట్ల ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు హర్షం వ్యక్తం చేశారు. ఆమె ఆచంటలో ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమెకు ఎంఎల్ఎ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతగా పనిచేసి పేద దళిత వర్గాల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. దళితుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియపరచి పరిష్కారానికి ఆమె కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, వైసిపి నాయకులు, పిల్లి రుద్రప్రసాద్, పోలిశెట్టి వనమయ్య, కోట సూర్యప్రకాశరావు ఉన్నారు.

భీమవరం అభివృద్ధికి చర్యలు : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నామని, ఇందులో భాగంగా ప్రతి వార్డులో కూడా శివారు ప్రాంతాలకు కూడా సీసీ రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని 15వ వార్డులో ఉన్న ప్రజల కోరిక మేరకు సీసీ రోడ్డు నిర్మించేందుకు ఆ ప్రాంతాన్ని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని మున్సిపల్ డిఇ విజయ్‌ని ఆదేశించారు. అనంతరం వీరమ్మ పార్కు వద్ద రోడ్డును డ్రైనేజీ నిర్మించడానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిఇ విజయ్‌ని ఆదేశించారు. అభివృద్ధి పథంలో భీమవరం పట్టణాన్ని రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ఇందులో ఎటువంటి సందేహం లేదని చెప్పారు.

ప్రకృతి వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - పాలకోడేరు

ఆయుర్వేద మందులు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ప్రకృతి వైద్యులు సంగీత పువ్వల అన్నారు. మండల కేంద్రమైన పాలకోడేరు గ్రామంలోని ఆయుష్ వైద్యశాలలో ఆయుర్వేద మందుల పంపిణీ చేసే కార్యక్రమాన్ని పాలకోడేరు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ రంగం నాయుడు సూచనల మేరకు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వైద్యులు డాక్టర్ సుజన మాట్లాడుతూ పురాతన కాలంలో ప్రతిఒక్కరూ ఆయుర్వేద వైద్యం మీదే ఆధారపడి వైద్యం పొందేవారని తెలిపారు. కాని ప్రస్తుత రోజుల్లో ప్రతిఒక్కరూ ఖరీదైన వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారని అన్నారు. ప్రకృతి ద్వారా లభించే మూలికలతో వైద్యం అందుతుందని ఆమె తెలిపారు. ప్రతిఒక్కరూ ఆయుష్ వైద్యశాలకు వచ్చి ఆయుర్వేద మందులు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. పిహెచ్‌ఎన్ కుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మద్యం మానేయాలని మందలించడంతో..

ప్రజాశక్తి - పెనుగొండ

మద్యం మానేయాలని కుటుంబసభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన వృద్ధుడు మద్యం సీసాలో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని సిద్ధాంతం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్ధాంతం అరుంధతీపేటకు చెందిన తానేటి యోబు(62)కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. యోబు మంగళవారం రాత్రి మద్యం సీసా పట్టుకుని ఇంటికి వెళ్లగా ఆతని కుటుంబ సభ్యులు మద్యం తాగడం మానేయాలని మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన యోబు మద్యం సీసాలో పురుగుల మందు కలుపుకుని తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు ఆతడిని ఆటోలో పెనుగొండ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి తణుకులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మృత్యుంజయ సొసైటీలో ఉద్యోగుల తొలగింపు అన్యాయం

మహాజన సభలో అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మృత్యుంజయ విశాల సహకార పరపతి సంఘంలో పనిచేస్తున్న సీనియర్ ఉద్యోగులకు ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా తొలగించడం అన్యాయమని అఖిలపక్ష నాయకులు బలుసు శ్రీరామ్మూర్తి అన్నారు. మృత్యుంజయ సొసైటీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మహాజన సభ కార్యదర్శి పారుపల్లి యేసురత్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాజన సభలో పలువురు మాట్లాడుతూ చారిత్రాత్మక, ప్రసిద్ధి ఆర్థిక అభివృద్ధిలో రాష్ట్రంలో తలమానికమైన సొసైటీని కాపాడుకోవాల్సిన బాధ్యత రాజకీయపార్టీలపై, రైతులపై, ప్రజలపై ఉందన్నారు. నా బార్డ్ రుణాలు సొసైటీకి ఆర్థిక భారం, ఉనికికి ప్రమాదకరంగా మారే పరిస్థితి ఉన్నందున మహాజనసభ నా బార్డ్ గ్రాంటును ఏకగ్రీవంగా తిరస్కరించేందుకు అఖిలపక్ష సభ్యులు తీర్మానించారు. కొత్తగా రూ.2.14 కోట్లు పైలెట్ ప్రాజెక్టు నిర్మాణం కోసం నాబార్డ్ నుంచి నిధులు తీసుకునేందుకు డిసిసిబి నుంచి అనుమతి తీసుకోవాలని తీర్మానించారు. ఐదుగురు సీనియర్ ఉద్యోగులకు ముందుగా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సిబ్బందిని తొలగించడం అన్యాయమన్నారు. తొలగించిన ఉద్యోగులతో పాటు కొత్తగా నియమించిన ఉద్యోగులను కూడా కొనసాగించాలని అఖిలపక్షం తీర్మానించింది. పరపతి సంఘం నిధుల దుర్వినియోగంపై, పైలెట్ ప్రాజెక్ట్, రైస్‌మిల్, గోడౌన్ తదితర వాటిపై కమిటీ సభ్యులు తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని, దీంతో రూ.మూడు కోట్లు డిపాజిట్ దారులు వెనుకకు తీసుకునేందుకు సిద్ధపడ్డారని చెప్పారు. దీంతో లాభాల్లో ఉన్న సొసైటీ నష్టాల బాట పడుతుందని అఖిలపక్ష సభ్యులు ఆందోళన చేశారు. తక్షణమే ఇటువంటి తప్పుడు నిర్ణయాలను వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సొసైటీకి డిపాజిట్లు పెంచడంలోనూ అభివృద్ధికి పాటుపడిన సెక్రటరీ పారుపల్లి యేసురత్నంను తొలగించాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే సొసైటీ వద్ద ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్ పర్సన్ పెచ్చెట్టి సత్యనారాయణ, పర్సన్స్ మొండి శ్రీనివాస్, వైట్ల కిషోర్‌కుమార్, తమ్మినేడి ప్రసాద్, కానుమిల్లి జోగరాజు, నెక్కంటి సతీష్, గొడవర్తి భాస్కరరావు, కమ్మ సత్యనారాయణ, సిపిఎం నాయకులు సిర్రా నరసింహమూర్తి, వద్దిపర్తి అంజిబాబు, ఎస్‌విఎస్.శర్మ, తోటపల్లి సత్యనారాయణ, తలుపూరి బుల్లబ్బాయి పాల్గొన్నారు.


మహాజన సభకు హాజరైన అఖిలపక్ష నాయకులు

సొంత గ్రామంలోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ఎన్‌ఆర్‌పి అగ్రహారంలో లబ్ధిదారుల నిరసన ర్యాలీ

నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - ఉండి

తమకు సొంత గ్రామంలోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని మండలంలోని ఎన్‌ఆర్‌పి అగ్రహారం గ్రామంలోని ఇళ్ల స్థలాల లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎన్‌ఆర్‌పి అగ్రహారం గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి గ్రామపంచాయతీ కార్యదర్శి జెవిటినాయుడు, ఉండి ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.వీరాస్వామినాయుడులకు వినతి పత్రాలను అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు గతంలో ప్రభుత్వం ఆధీనంలో ఉన్న విజయ పాలశీతల కేంద్రం స్థలాలను ఇళ్ల స్థలాలుగా మార్చి జియో ట్యాగింగ్ కూడా చేశారన్నారు. కానీ తర్వాత కాలంలో అగ్రహారంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల స్థానంలో వెలువర్రు గరువు ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు అధికారులు చెప్పారన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా గరువు ప్రాంతానికి వెళ్లడానికి సరైన రహదారి మార్గం లేదని, వర్షం వస్తే రహదారి మొత్తం చిత్తడి చిత్తడిగా మారుతుందని, తమకు ఇళ్ల స్థలాలు కేటాయించిన ప్రాంతంలో ఇప్పటికే సరైన వసతులు అందుబాటులో లేవని, ఇప్పుడు తమను అటువంటి ప్రాంతంలో ఇల్లు నిర్మించాలని అధికారులు బలవంతం చేస్తున్నారని వారు ఆరోపించారు. ప్రస్తుతం ఎన్‌ఆర్‌పి అగ్రహారంలో మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమి నిరుపయోగంగా ఉందని, ఆ భూమిని ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. తమకు ప్రభుత్వ గుర్తింపు పత్రాలు అన్ని ఎన్‌ఆర్‌పి అగ్రహారం గ్రామంలోనే ఉన్నాయని, అక్కడే ఇళ్ల స్థలాలు కేటాయించాలని, కొత్తగా కేటాయించిన స్థలాల్లోకి తాము వెళ్లేది లేదని, అవసరమైతే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్తామని వారు స్పష్టం చేశారు.

అమ్మఒడి పథకం.. పేద విద్యార్థులకు వరం

ప్రజాశక్తి - ఆచంట

అమ్మఒడి పథకం పేద విద్యార్థుల పాలిట గొప్ప వరమని ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. కొడమంచిలి హైస్కూల్లో బుధవారం అమ్మఒడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే విధంగా అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జగనన్న గోరుముద్ద ద్వారా వారికి పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వదిలేయకుండా వారు ఎలా చదువుతున్నారో ఎప్పటికప్పుడు వాకాబు చేయాలని కోరారు. కేవలం ఒక నియోజకవర్గంలోని విద్యార్థులకు అమ్మఒడి ద్వారా రూ.31.19 కోట్లు నేరుగా తల్లుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచంట ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, ఎఎంసి మాజీ ఛైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్, ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, ఉపసర్పంచి ములగాడ వరప్రసాద్, రైతు సంఘం అధ్యక్షులు మన్నె సుబ్బారావు, ఆలయ ఛైర్మన్ బాలనాగు, నరేష్, పెదమల్లం సర్పంచి దిరిశాల విజయలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు యల్లమెల్లి బేబీ రాజేష్, ఏడిద రామలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షులు సాక సురేష్, వైసిపి సెల్ మండల అధ్యక్షులు కొండేటి రమేష్, ఎంపిడిఒ జగన్నాధరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీరవాసరం : తమ హక్కుల కోసం ఉద్యమాలు చేసే ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ పట్ల కూడా అంతే శ్రద్ధతో విద్యాబోధన చేయాలని భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. జగనన్న అమ్మఒడి మండల స్థాయి కార్యక్రమాన్ని బుధవారం వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఎంఆర్‌కె హైస్కూల్‌లో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉండటంతో ఉపాధ్యాయుల తీరు పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వీరవాసరం విద్యాదాతగా ఉన్న ఎంఆర్‌కె హైస్కూల్‌లో విద్యాబోధన ఈ విధంగా ఉండటం సిగ్గుచేటన్నారు. వీరవాసరం మండలంలో సుమారు రూ.66 కోట్లు విద్యకు కేటాయించినట్లు తెలిపారు. తల్లితండ్రులు, విద్యార్థుల ఆలోచనకు అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఆర్.వెంకటరమణ, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, సర్పంచులు చికిలే మంగతాయారు, వీరవల్లి శ్రీనివాసరావు, గెడ్డం భారతి, ఎస్ఎంసి ఛైర్మన్ చుండూరు ముసలయ్య, నూకల కనకారావు, కాశీ, తహశీల్దార్ సుందరరాజు, ఎంపిడిఒ జ్యోతి, ఎంఇఒ ఎంఎన్.శ్రీమన్నారాయణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో...

పెనుమంట్ర : జగనన్న అమ్మఒడి మండల స్థాయి కార్యక్రమం పెనుమంట్ర హైస్కూలులో ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సర్పంచి తాడిపర్తి ప్రియాంక అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసురెడ్డి) మాట్లాడుతూ మండలంలోని 4,883 లబ్ధిదారులకు అమ్మఒడి సొమ్ము జమ అయినట్లు తెలిపారు. సర్పంచి తాడిపర్తి ప్రియాంక మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీసుభాషిణి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, తహశీల్దార్ దండు అశోక్ వర్మ, ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయాల సిబ్బంది, పాఠశాల విద్యాకమిటీల ఛైర్మన్, సభ్యులు, మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో 'డిఎన్‌ఆర్' విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొల్లు

భారత ప్రభుత్వం యువజన మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం, వైఎన్ కళాశాల సంయుక్తంగా నరసాపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి కల్చరల్ పోటీల్లో పాలకొల్లు డిఎన్‌ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎం.హర్షిత పెయింటింగ్‌లో ప్రథమ స్థానం పొందింది. బృంద నృత్యంలో శ్రేయ, శైలజ, వరలక్ష్మి, శృతి, లక్ష్మి, శ్రీలక్ష్మి బృందం మూడో స్థానం పొందారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విజేతలకు అభినందనలు తెలిపారు.

పంట కాల్వలో గుర్రపుడెక్క తొలగింపు

ప్రజాశక్తి - ఉండి

చెరుకువాడ గ్రామ శివారు ప్రాంత రైతులకు ఉండి పంట కాలవ నుంచి నీరు అందించడంలో ఇరిగేషన్ శాఖ అధికారులు విఫలమయ్యారని స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయగా ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.వీరాస్వామినాయుడు సూచనల మేరకు ఇరిగేషన్ శాఖ సిబ్బంది బుధవారం పంట కాలువలోని చెత్తాచెదారాన్ని, గుర్రపు డెక్క, కాలువలో పడి ఉన్న చెట్లను తొలగించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ సిబ్బంది మాట్లాడుతూ విద్యుత్ శాఖ సిబ్బంది కాలువ వెంబడి ఉన్న చెట్లను నరికి కాలువలో పడేయడం వల్ల నీటి ప్రవాహం మందగించిందని, దీంతో శివారు ప్రాంత రైతులకు నీరు వెళ్లేందుకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ వీరాస్వామి నాయుడు సూచనల మేరకు వాటిని తొలగించి శివారు ప్రాంత రైతులకు నీరు వెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఉండి

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జగనన్న సురక్ష మండల కన్వీనర్ బులుసు వెంకట రామకృష్ణ అన్నారు. మండలంలోని వాండ్రం, ఎన్‌ఆర్‌పి అగ్రహారం గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వేపై వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి, గృహ సారథులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బులుసు వెంకట రామకృష్ణ మాట్లాడుతూ అర్హులందరికీ అర్హత పత్రాలు చూపిస్తే వెంటనే అప్పటికప్పుడు వారికి కావాల్సిన సర్టిఫికెట్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గతంలో ఈ సర్టిఫికెట్లకు చెల్లించిన రుసుమును ఇప్పుడు ఇచ్చే సర్టిఫికెట్లకు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. జగనన్న సురక్ష సర్వేకు ప్రజలందరూ సహకరించి వారికి కావాల్సిన సర్టిఫికెట్లు పొందాలని ఆయన కోరారు.

ఏలూరుపాడులో జిల్లా అధికారుల పర్యటన

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడు గ్రామంలో వ్యవసాయ భూమిని చేపల చెరువుగా మార్పు చేసే ప్రాంతాన్ని జిల్లా స్థాయి కమిటీ బుధవారం పరిశీలించారు. జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఆర్‌విఎస్‌వి.ప్రసాద్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ, పొల్యూషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఏలూరుపాడు పంచాయతీ కార్యాలయంలో రైతులతో, గ్రామస్తులతో అధికారులు చర్చించారు. ఆక్వా సాగుతో తాగునీటి వనరులను కలుషితం చేయవద్దని, ఆక్వా చెరువుల తవ్వకాలు వద్దని గతంలో పంచాయతీ తీర్మానం చేశారు. 22 ఎకరాల భూమి గల 17 మంది రైతులు కోర్టును ఆశ్రయించారు. గాంధీబజార్ వీధిలో రక్షిత మంచినీటి చెరువు సమీపంలో వ్యవసాయ భూములను చేపల చెరువులుగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తుండగా గ్రామస్తులు గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్ఎస్ నెంబర్ 228 నుంచి 247 వరకు ఉన్న వ్యవసాయ భూములను చేపల చెరువులుగా మార్పు చేస్తే వాటికి సమీపంగా రక్షిత మంచి నీటి చెరువు కాలుష్య బారిన పడే అవకాశం ఉందని గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆక్వా చెరువుల వల్ల పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని, భూగర్భ జలాలు పూర్తిగా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని, తాగునీటి వనరులు పూర్తిగా నాశనం అవుతాయని, భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని ఆక్వా చెరువులు తవ్వకూడదని పంచాయతీ తీర్మానం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తీర్మానం చేశారు. 17 మంది రైతులు తమ భూమిలో వరి సాగు సరిగా పండడం లేదని చెరువు తవ్వకానికి అనుమతులు కోరుతూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు జిల్లా స్థాయి కమిటీకి సిఫార్సు చేయడంతో మత్స్య శాఖ, రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, మత్స్యశాఖ అధికారులు ప్రియదర్శిని, రాంబాబు, గ్రామస్తులు నల్ల గచ్చు నాగార్జున, నిమ్మకాయల సాయి, కొట్టుప్రభాకర్, యదాల వెంకటేశ్వరరావు, కొండపల్లి మోహన్ పాల్గొన్నారు.

సమగ్ర కార్మిక చట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి - ఆకివీడు

కార్మికుల రక్షణ కోసం సమగ్ర కార్మిక చట్టం అమలు చేసి కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. బజారులాగుడుబండ్ల యూనియన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) బాడీ సమావేశం కార్యాలయంలో పాండురంగారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వాసుదేవరావు పాల్గొని మాట్లాడారు. రైస్‌మిల్ గోడౌన్ల, మార్కెట్ ఎగుమతి, దిగుమతులు హమాలీలకు సమగ్ర కార్మిక చట్టం చేసి వాళ్ల జీవన విధానానికి తోడ్పడాలన్నారు. ప్రస్తుతం కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం అన్నివిధాలా కార్మికులను ఆదుకోవాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి నాయుడు మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గ కమిటీ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులుగా మణిపురి సత్యనారాయణ, సభ్యులుగా పి.అచ్చయ్య, బి.అప్పలనాయుడు, యు.వెంకటరమణ, ఎన్.సూరిబాబు, పి.వెంకటరమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అధ్వానంగా రోడ్డు.. ఇబ్బందుల్లో ప్రయాణికులు

నామమాత్రపు మరమ్మతులతోనే సరి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఎట్టకేలకు పొలమూరు నుంచి నౌడూరు సెంటర్ వెళ్లే రహదారి నిర్మించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. గోతులతో అధ్వానంగా ఉన్న రోడ్డును నిర్మించకుండా చదును చేసే పనులు ప్రారంభించారు. రహదారి నిర్మించాలని సిపిఎం, ప్రజాసంఘాలు, రైతు సంఘం ఆధ్వర్యంలో సిపిఎం, ప్రజాసంఘాలు, రైతు సంఘం ఆధ్వర్యంలో కాలినడక యాత్రలు, బైక్ ర్యాలీ నిర్వహించినా అధికారుల్లో స్పందన లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. వర్షం పడితే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్‌ఛార్జి ఆర్‌అండ్‌బి ఎఇ యశ్వంత్‌ను వివరణ కోరగా ప్రస్తుతం మరమ్మతులు చేసి అనంతరం మెటీరియల్ తీసుకొని ఎన్‌బిబి నిధులు రూ.1.50 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

నేడు పెంపుడు కుక్కలకు ఉచిత టీకాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పశుఆసుపత్రిలో గురువారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేయనున్నామని పశు వైద్యాధికారిని నీలిమ తెలిపారు.

భీమవరం : పశు సంక్రమిత వ్యాధులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని భీమవరం ప్రాంతీయ పశు వైద్యశాలలో గురువారం నిర్వహించనున్నారు. పశువులకు ఉచిత టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

వైద్యులు మానవతా దృక్పథంతో ఉండాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రోగుల పట్ల వైద్యులు మానవతా దృక్పథంతో నడుచుకోవాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సూచించారు. కాకినాడ జిల్లా నుంచి భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప పిహెచ్‌సి వైద్యురాలిగా బదిలీపై వచ్చిన డాక్టర్ సిహెచ్.ధనలక్ష్మి బుధవారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే నాడు-నేడు పథకంలో ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నారన్నారు. అంతేకాకుండా వైద్యాన్ని ప్రజలకు మరింత దగ్గర చేసేందుకు వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లను కూడా ఎక్కడికక్కడ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో సుమారు 3500కి పైగానే వ్యాధులకు మన రాష్ట్రంలోని కార్పొరేట్ ఆసుపత్రులతో పాటుగా ఇతర రాష్ట్రాల్లో ఎంపిక చేసిన కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు పట్ల వైద్యులు ఓపికతో, సహనంతో, మానవతా దృక్పథంతో నడుచుకుని మంచి పేరు తెచ్చుకోవాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సూచించారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - ఉండి

ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉండి ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ అన్నారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహన చోదకులు నిర్లక్ష్యంగా వాహనాలను నడిపి ప్రాణాలను పోగొట్టుకుని వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నారన్నారు. మండలంలోని చెరుకువాడ మెయిన్ సెంటర్లో బుధవారం సాయంత్రం హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుల ప్రాణాలను కాపాడేందుకే ప్రభుత్వం హెల్మెట్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తుందన్నారు. ఎన్నిసార్లు అవగాహన కార్యక్రమాలను నిర్వహించినా వాహనదారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో జరిమానా విధించడంతోనైనా మారుతారని తాము భావిస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ద్విచక్ర వాహనదారులు పాల్గొన్నారు.

'శ్రీవాసవి'లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక శ్రీ వాసవి జూనియర్, డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. చెన్నై, తిరుపతిలలో ఉద్యోగాల నిమిత్తం జిఎల్ కంపెనీవారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. మొత్తం వంద మంది విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరవ్వగా వారిలో 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి కళాశాల ప్రిన్సిపల్ ఎం.రామకృష్ణ, ఉమ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రమణరావు మాట్లాడుతూ విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి విద్యార్థులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని చెప్పారు.

హుండీ ఆదాయం రూ.21.85 లక్షలు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు శ్రీ స్వయంభూ వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు కాళ్లకూరు భీమేశ్వర స్వామి ఆలయ ఎఒ అల్లూరి సత్యనారాయణరాజు సమక్షంలో ఈ లెక్కింపు జరిగింది. 98 రోజులకు హుండీ ఆదాయం లెక్కించగా రూ.21,85,602 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణఅధికారి మోకా అరుణ్‌కుమార్ తెలిపారు. ఆలయ ఛైర్మన్ డి.వి.కృష్ణంరాజు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పెనుమెచ్చ కుమార్‌రాజు, నరేష్ రాజు, బొర్రా నారాయణ, కంబాల వెంకన్న, బి.వెంకటకృష్ణారావు, గ్రామ పెద్దలు అడ్డాల గణపతిరాజు పాల్గొన్నారు.

'ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసు బాధితులకు న్యాయం'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా ఎస్‌సి ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం మంగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ ఎస్‌సి ఎస్‌టిలపై దాడులు జరిగిన వెంటనే స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఎస్‌సి ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా తన నియామకానికి కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు మెరుగు నాగార్జున, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ ప్రశాంతిలకు కృతజ్ఞతలు తెలిపారు.

దస్తావేజులు పోయినవి
గుంటూరు జిల్లా, పాతగుంటూరు కాపురస్తులు అయిన షేక్ అస్మత్, W/o. రియాజ్ అను నాకు చినపాలపర్రు డాక్యుమెంట్ నంబర్స్ 247/2, 248 అను డాక్యుమెంట్స్ మా అబ్బాయి బైక్ సీట్ బాగ్‌లో పెట్టుకొని వస్తుండగా దారిలో పడిపోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. కావున మా ఈ దస్తావేజులు (ఆస్తి పత్రాలు) దొరికినవారు ఈక్రింది ఫోన్ నంబర్స్‌కు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము. ఈ దస్తావేజులు ఎవరికైనా దొరికినా అవి ఉపయోగపడవు.
షేక్ అస్మత్, భర్త: రియాజ్
పాత గుంటూరు, గుంటూరు
సెల్: 9381265060, 9603133236
9014594876